## క్లుప్తంగా

### యోగా పోటీల్లో శ్రీకాళహస్తి వాసికి ప్రథమ బహుమతి



సుజాతకు బహుమతి ప్రదానం చేస్తున్న నిర్వాహకులు

శ్రీకాళహస్తి: తిరుపతిలో జరిగిన యోగా పోటీల్లో పట్టణానికి చెందిన యోగ శివసాయి యోగా సెంటర్ నిర్వాహకురాలు అయిలం సుజాత మొదటి బహుమతి సాధించారు. అలాగే ఆమె శిష్యులు శ్రీనిధి, వరదన్ రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. వీరిని పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో వైఎస్‌ఏ తిరుపతి జిల్లా అధ్యక్షుడు కైలాష్, కార్యదర్శి మునిమంజుల తదితరులు పాల్గొన్నారు.

### విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు


వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న బాలికలు

సత్యవేడు: ఎంపీడీఓ కార్యాలయంలో మండల విద్యాశాఖ అధ్వర్యంలో గురువారం వికసిత్ ఆంధ్రప్రదేశ్ –2047 అనే అంశంపై వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. వక్తృత్వ పోటీల్లో పి. జీవిత(పుదుకుప్పం తమిళ జెడ్పీ ఉన్నత పాఠశాల), ఎస్ ప్రశాంత్(మదనంబేడు జెడ్పీ హైస్కూల్), కే. చందనసాయి(సత్యవేడు బాలికల గురుకుల పాఠశాల) విద్యార్థులు ప్రథ మ, ద్వితీయ , తృతీయ బహుమతులు సాధించారు. వ్యాచరచన పోటీల్లో పి.జీవిత (పుదు కుప్పం తమిళం జెడ్పీ ఉన్నత పాఠశాల) ప్రథ మ బహుమతికి ఎంపిక కాగా, ద్వితీయ మహాలక్ష్మి(బాలకల గురుకుల పాఠశాల), తృతీయ బహుమతికి నివేద (బాలికల ఉన్నత పాఠశాల) విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో డీవి. రాజు తదితరులు పాల్గొన్నారు.

### పేదలకు అన్నదానం


అన్నదానం చేస్తున్న దాతలు

శ్రీకాళహస్తి: పట్టణంలోని బస్టాండ్ ఆవరణలో గురువారం డొక్కా సీతమ్మ స్ఫూర్తితో జనసేన నాయకులు అన్నదానం చేశారు. సుమారు 400 మంది పేదలకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో పేట చంద్రశేఖర్, పేట చిరంజీవి, జ్యోతిరామ్, రవి తదితరులు పాల్గొన్నారు.

### రైతుల నిరసన


చెరువులో నిరసన తెలుపుతున్న రైతులు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కరకంబట్టు చెరువుకు నీరందించే వరవకాలువకు మరమ్మతులు చేసి, చెరువుకు తెలుగుగంగ నీటిని అందించాలని గురువారం రైతులు ఎండిన చెరువులో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ కరకంబట్టు చెరువుకు నీరందించే వరవ కాలువలకు మరమ్మతులు చేపట్టకపోవడంతో చెరువులోకి చుక్కనీరు రావడంలేదన్నారు. చెరువులోకి నీరు రాకపోవడంతో పంటలు సాగులేదని, దీంతో పొలాలు బీడు భూములుగా మారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇరిగేషన్‌శాఖ ఉన్నతాధికారులు స్పందించి చెరువు నీరందించే వరవ కాలువలకు మరమ్మతులు చేపట్టాలని కోరారు.

### మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి


సమావేశంలో మాట్లాడుతున్న సీఐ జయచంద్ర

ఏర్పేడు: విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఏర్పేడు సీఐ జయచంద్ర అన్నారు. బుధవారం మండలంలోని పల్లం జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మత్తుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుంచి చదువుపై ధ్యాస పెట్టాలన్నారు. యువకులు, విద్యార్థులు మత్తుకు బానిసలు కావద్దని సూచించారు. యువకులు బయట ప్రాంతాల నుంచి గంజాయి తదితర మాదక ద్రవ్యాలను తెచ్చి విద్యాసంస్థల్లో విక్రయించి, వాడుతున్నట్లు సమాచారం ఉందని చెప్పారు. చిన్నపిల్లలు, మహిళలపై అత్యాచారాలు జరుగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

---

వెదజల్లే పద్ధతిలో సాగు చేసిన వరి



రాజగోపాలపురంలో విత్తనాలు చల్లుతున్న ట్రాక్టర్ సీడ్‌డ్రిల్



# వెద సాగుబడి.. సిరుల ఒడి

- తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి
- సాగుకు మొగ్గు చూపుతున్న అన్నదాతలు
- విత్తనశుద్ధితో తెగుళ్ల నుంచి రక్షణ

**సంప్రదాయ పద్ధతులు.. అధిక పెట్టుబడులు..ఆర్థిక ఇబ్బందులు.. వ్యవసాయం లాభసాటిగా లేదన్న వేదన. తరతరాలుగా ఇదే దైన్యం. అయితే మన నుంటే మార్గం ఉంటుంది అన్నారు పెద్దలు. ఆ బాటలో నడిచారు సత్యవేడు నియోజవర్గ కర్షకులు. శాస్త్రవేత్తల సూచనలు..మార్గదర్శకంతో వెద పద్ధతిలో సాగు ప్రయోగం చేశారు. అధిక దిగుబడి సాధించి, ఆర్థికయోగం పొందారు. వెదసాగుతో సిరులు పంట పండించారు.**

సత్యవేడు: పంట సాగు ఖర్చులు భారీగా పెరిగిపోవడంతో ఆధునిక పద్ధతుల్లో సాగు చేయడానికి రైతులు సన్నద్ధమవుతున్నారు. ఎరువులు, పురుగు మందుల ధరలతో పాటు కూలీ ఖర్చులు తడిసి మోపెడవుడుతండడంతో రైతులు వరి నాట్లు వేసే పద్ధతికి క్రమంగా స్వస్తి చెబుతున్నారు. పెట్టుబడి, ఖర్చు తగ్గే వెద పెట్టే విధానంపై రైతులు మెగ్గు చూపుతున్నారు.

**విత్తన ఖర్చు స్వల్పం**

వెద పెట్టే పద్ధతిలో విత్తనం చల్లడంతో ఎకరానికి 20 నుంచి 24 కేజీల వరకు విత్తనం ఖర్చు అవుతుంది. అదే నారు పెంచేందుకు సుమారు 40 కిలోల నుంచి 60 కిలోల వరకు విత్తనం కావాల్సి వస్తుంది. దీంతో విత్తన ఖర్చు ఎకరానికి రూ.4 వేలు మిగులుతుంది. నాట్లు వేసే సమయంలో వరి నారు తీయడానికి, నాట్లు వేసేందుకు కూలీలకు అయ్యే ఖర్చు ఎకరానికి సుమారు రూ.7 వేల వరకు ఆదా అవుతుంది. దీనికి తోడు ముఖ్యంగా కూలీల కొరతను అధిగమించవచ్చు. వెద పద్ధతి, వెదజల్లే పద్ధతిలో విత్తనాలు పైపైనే పడి తొందరగా పిలకలు వృద్ధి చెందుతాయి. ఒక్కొక్క మొక్క ఉండడంతో పోషకాలు మొక్కకు సక్రమంగా అందుతాయి. గాలి, వెలుతురు సమాన స్థాయిలో ప్రసరించడంతో పంట ఆరోగ్యకరంగా పెరిగి చీడ పీడలు తక్కువగా ఆశిస్తాయి. దృఢమైన పిలకలు ఎక్కువగా ఉండడంతో దిగుబడి నాలు గైదు బస్తాలు అధికంగా వస్తుంది.


విత్తన శుద్ధిపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారి

**నాలుగు మండలాల పరిధిలో ..**

సత్యవేడు, వరదయ్యపాళెం, బుచ్చినాయుడు కండ్రిగ, కేవీబీపురం మండలాల్లో రబీలో సుమారు 12 వేలు ఎకరాల్లో వరి పంటను వెదజల్లే పద్ధతిలో సాగు చేసేందుకు సిద్ధ మయ్యారు. ఇప్పటికే సత్యవేడు మండలంలో ఇరుగుళం, కాళమనాయుడుపేట, ఎన్ఆర్ అగ్రహారం, ఆంబాకం, కాదిరివేడు, శిరుణంబూదూరు, వీఆర్ కండ్రిగ, చిన్న ఈటిపాకం, పాలగుంట, రాజగోపాలపురం, వానెల్లూరు, రాళ్లకుప్పం గ్రామాల్లోని రైతులు సుమారు 200 ఎకరాల్లో పాన్‌మని(సీఆర్ 1009), 1639, ఎంటీవీ 1224, 1271, 1262, 5204(డీటీటీ) రకాల వరి పంట సాగు చేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు కొంత అనుకూలంగా ఉండడంతో కొంత వరిసాగు చేశారు. అప్పుడప్పుడు అడపాదడపా వర్షాలు పడుతుండడంతో చెరువుల్లో చేరుతున్న నీరు ఆరుదులకైనా అందుతుందనే భావం రైతుల్లో నెలకొంది.

**విత్తన శుద్ధి కీలక ప్రక్రియ**

పంటల సస్యరక్షణలో విత్తన శుద్ధి కీలకం. విత్తన శుద్ధితో తొలిదశలో ఆశించే పురుగులు, తెగుళ్ల భారీ నుంచి పంటలను కాపాడుకోవచ్చు. భూమిని దున్నడం ఎంత ముఖ్యమో విత్తన శుద్ధి కూడా అంతే ముఖ్యం. తక్కువ ఖర్చు, అధిక దిగుబడి సాధించడానికి విత్తన శుద్ధి కీలక ప్రక్రియ.

**తక్కువ ఖర్చుతో సాగు**



వెద జల్లే పద్ధతిలో ఎకరం వరి సాగు చేశా. ఇప్పటికి విత్తనాలు, ట్రాక్టర్ అద్దెకు రూ. 4వేలు ఖర్చు అయ్యింది. ఇరవై రోజులు కావస్తోంది. వర్షాలు పడుతుండడంతో నీటి ఆవసరం అంతగా లేకుండా పోయింది. కూలీలు దొరక్క, పెరిగిన ఖర్చులు భరించలేక ఈ విధానంలో సాగు చేశా.

-గుణశేఖర్, రైతు, కేఎన్‌పేట

**విత్తన శుద్ధిపై అవగాహన కల్పించాం**



విత్తన శుద్ధిపై అవగాహన కల్పించాం. కిలో విత్తనానికి మూడు గ్రాముల కార్బండిజమ్ లేదా. 2.5 గ్రాముల మాంకోజబ్ కలిపి విత్తన శుద్ధి చేసుకోవాలి. జీవ రసాయనాలతో మరోసారి శుద్ధి చేయాలి. గింజ పగల కుండా, పైపొర పోకుండా జాగ్రత్త తీసుకోవాలి. శుద్ధి చేసేటప్పుడు చేతులకు గ్లౌజు, ముఖానికి గుడ్డ కట్టుకోవాలని సూచించాం.

- మదన్‌మోహన్, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్, రాజగోపాలపురం

**రైతులకు ఎంతో మేలు..**



వెద పద్ధతిలో సాగు ఎంతో మేలు. ఈ విధానంలో ముందుగా నారుమళ్లు సాగు చేయాల్సిన అవసరం ఉండదు. నారుమడి తయారీకి అయ్యే ఖర్చుతోపాటు కూలీలు, దుక్కి ఖర్చులు మిగులుతాయి. అలాగే నారు తీయడం, నాటు వేయడానికి అయ్యే ఖర్చులు తగ్గుతాయి. నీరు ఎప్పుడు అందుబాటులో ఉంటే అప్పుడే వెద పద్ధతిలో సాగు చేసుకోవచ్చు.

-మురళి, వ్యవసాయ అధికారి సత్యవేడు.

---

### ఉత్తమ ఉపాధ్యాయునికి సన్మానం

శ్రీకాళహస్తి: గురుపూజోత్సవం సందర్భంగా జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుడుగా పురస్కారం అందుకున్న గణిత ఉపాధ్యాయులు మునీశ్వర్ రెడ్డిని గురువారం రెడ్డి వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో ఘనంగా సన్మానించారు. పలువురు మాట్లాడుతూ మునీశ్వర్‌రెడ్డి భవిష్యత్తులో మరిన్ని పురస్కారాలు అందుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో చెంచు రెడ్డి, సునీల్‌రెడ్డి, మునిరెడ్డి, మహేంద్రనాథ్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, మురళిరెడ్డి, కార్తీక్‌రెడ్డి, శేషాచలం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### గురుదక్షిణామూర్తికి ప్రత్యేక పూజలు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో గురుదక్షిణామూర్తికి గురువారం ఆగమోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా గురుదక్షిణామూర్తికి పలు రకాల అభిషేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించి ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. భక్తులు పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు.

### లోక్ అదాలత్ విజయవంతం చేయండి

శ్రీకాళహస్తి: రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు శనివారం జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని శ్రీకాళహస్తి న్యాయస్థానం జిల్లా అదనపు న్యాయమూర్తి శ్రీనివాస్‌నాయక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. లోక్ అదాలత్‌లో అన్ని రకాల కేసులు పరిష్కరిస్తామన్నారు. లోక్ అదాలత్‌లో తీర్పు అంతిమమన్నారు. అపీల్‌కు అవకాశం లేదని తెలిపారు. అన్నిశాఖల అధికారులు జాతీయ లోక్ అదాలత్ విజయవంతానికి కృషి చేయాలని తెలిపారు.

### టీసీఎల్‌లో వైద్య శిబిరం


పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

ఏర్పేడు: మండలంలోని వికృతమాల టీసీఎల్ కర్మాగారంలో ఈఎస్ఐ ఆధ్వర్యంలో గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. కంపెనీలో వివిధ విభాగాల్లో విధులు నిర్వహించే కార్మికులకు వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో వైద్య శిబిరం ఇన్‌చార్జి డాక్టర్ గోపీనాథ్, డాక్టర్లు ధనలక్ష్మి, అస్టిన్‌రాజు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## యాజమాన్య పద్ధతులపై శిక్షణ


రైతులకు యాజమాన్యపద్ధతులపై సూచనలు చేస్తున్న వ్యవసాయ అధికారులు శ్రీనివాస్


రాజులకండ్రిగలో రోజపూల తోటలను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

సత్యవేడు: వరి సాగులో అధిక దిగుబడులు సాధించడానికి మేలైన యాజమాన్య పద్ధతులపై రైతులకు రాజుల కండ్రిగలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా వనరుల కేంద్రం(డీఆర్సీ)తిరుపతి–వ్యవసాయ అధికారులు శ్రీనివాస్ శశిధర్‌రెడ్డి ఆధ్వర్యంలో యాజమాన్య పద్ధతిపై అవగాహన కల్పించారు. విత్తనం ఎంపిక, విత్తన శుద్ధి, నారుమడులు, పొలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు వివరించారు. వెద పద్ధతిలో వరిసాగు చేసిన రైతులు కలుపు యాజమాన్యం సక్రమంగా నిర్వహించాలని సూచించారు. వరిలో అధిక దిగుబడి సాధించడానికి యంత్రాలతో వరినాట్లు, కాలిబాటలు తీయడం, సూక్ష్మపోషకాలు, జింకుసల్ఫేట్, కాంప్లెక్స్ ఎరువులను దుక్కిలోనే వేయడంతోపాటు సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో శశిధర్‌రెడ్డి, (ఆత్మ,చిత్తూరు), ఏఓ మురళి, సర్పంచ్ ఎస్, సుజాత, గ్రామ వ్యవసాయ సహాయకులు స్వర్ణ, రైతులు తదితరులు పాల్గొన్నారు.

### అక్రమ నిర్మాణం అడ్డగింత

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయం నాలుగో గేటు సమీపంలో డి చంద్రారెడ్డి నిర్మిస్తున్న అక్రమ కట్టడాన్ని పురపాలక సంఘం అధికారులు అడ్డుకున్నారు. సన్నిధివీధిలోని రోడ్డు స్థలాన్ని ఆక్రమించి నిర్మించిన తాత్కాలిక దుకాణాలను తొలగించి, భవన నిర్మాణ పనులు చేపట్టాడు. విషయం తెలుసుకున్న పురపాలక సంఘం అధికారులు అనుమతి లేదని అడ్డుకున్నారు. కాగా దీంతో చంద్రారెడ్డి, పురపాలకసంఘం మాజీ చైర్మన్ ముత్యాల పార్థసారథి, అతని అనుచరులు పురపాలకసంఘ అధికారులను దుర్భాషలాడారు.

## క్యాన్సర్‌పై అందరికీ అవగాహన అవసరం

రేణిగుంట: క్యాన్సర్‌పై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని టాటా ట్రస్టు డాక్టర్ వెంకయ్యబాబు అన్నారు. మండలంలోని కరకంబాడి ఇందిరానగర్ రాస్ కార్యాలయంలో గురువారం టాటా ట్రస్టు వారి ఆధ్వర్యంలో ఉచిత క్యాన్సర్ వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో పాల్గొన్న మహిళలు, పురుషులకు రక్తపోటు, మధుమేహం, హెపటైటిస్ బి అండ్ సి, నోరు, రొమ్ము, గర్భాశయ క్యాన్సర్లకు సంబంధించి అన్ని పరీక్షలను ఉచితంగా చేశారు. ఈ కార్యక్రమంలో టాటా ట్రస్టు సిబ్బంది హేమంత్ కుమార్, రెడ్డికుమారి, మెహతాజ్, మహేంద్ర, రాస్ మహిళా జ్యోతి ట్రస్టు ప్రాజెక్ట్ ఆఫీసర్ వెంకటేష్, ఫీల్డ్ ఆఫీసర్ గిరిప్రసాద్, అన్నలగన్, ఇందుమతి, స్వాతి, నాగమణి, జ్యోతి, శంకరయ్య, మునిరత్నం ట్రస్టీలు రమేష్‌రెడ్డి, నిత్యసుధా, క్లస్టర్ లీడర్లు పాల్గొన్నారు.



పరీక్షలు చేస్తున్న వైద్యుడు

### ముక్కంటి సేవలో గోవా మంత్రి


రాహుకేతు సర్పదోష నివారణ పూజల్లో విశ్వజిత్ రాణె

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామివారిని గురువారం గోవా మంత్రి విశ్వజిత్ రాణె కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. దక్షిణ గోపురం వద్ద ఈఓ ఎస్వీఎస్ఎన్ మూర్తి వారికి సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికి దర్శన ఏ ర్పాట్లు చేశారు. ముందుగా వారు ప్రత్యేక రాహుకేతు సర్పదోష నివారణ పూజలు చేయించుకున్నారు. అనంతరం స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. మృత్యుంజయస్వామి సన్నిధిలో వేద పండితులు వారిని ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.

## ప్రతి ఇంటినీ సందర్శించండి

నారాయణవనం: ఫీవర్ సర్వేలో భాగంగా ప్రతి ఇంటినీ ఆరోగ్య కార్యకర్తలు సందర్శించి, జ్వరపీడితుల గుర్తింపు, డ్రైడే పాటింపుపై అవగాహన కల్పించాలని జిల్లా మలేరియా అధికారి రూప్‌కుమార్ సూచించారు. గురువారం ఆయన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసి, రికార్డులను పరిశీలించారు. అనంతరం క్షేత్రస్థాయి వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లతో మాట్లాడుతూ జ్వరానికి కారకమైన దోమల వృద్ధి చెందకుండా పరిసరాల శుభ్రతపై, శుక్రవారం పాటించాల్సిన డ్రైడే ఆవశ్యకతపై ప్రజల్లో చైతన్యం కల్పించాలన్నారు. ఫీవర్ సర్వేలో గుర్తించిన జ్వరపీడితుల గృహాలను ఏఎన్ఎంలు సందర్శించి, ప్రాథమిక వైద్య సేవలను అందించి, పీహెచ్‌సీకి రెఫర్ చేయాలని సూచించారు. ఆరోగ్య కార్యకర్తలు తమ పరిధిలోని గృహాలను సందర్శించి మంచినీటి నిల్వలు లేకుండా చూడాలని, పరిసరాల పారిశుద్ధ్యంపై అవగాహన పెంచాలని చెప్పారు. నారాయణవనంలో జ్వరాలు అధికంగా నమోదైన ప్రాంతాలను పీహెచ్‌సీ డాక్టర్లు దర్శిత్ రాజ్, రాగసుధతో కలిసి సందర్శించారు.


నీటి తొట్టెలను పరిశీలిస్తున్న వైద్యబృందం

## పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత

శ్రీకాళహస్తి: పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత అని సిటిజన్స్ వెల్ఫేర్ ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోలా వెంకటేశ్వరరావు అన్నారు. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద వినూత్నంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆక్సిజన్ ఉత్పత్తి చేసే మొక్కలను నాటి, పచ్చదనాన్ని పెంచాలన్నారు. భవిష్యత్తు తరాలకు మంచి ప్రకృతిని అందించాలంటే మనం నేడు పర్యావరణాన్ని పరిరక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త గల్లా చంద్రశేఖర్‌నాయుడు, కోలా సంగీత, గోపాలాచారి, చరణ్‌సాయి, వాసుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.


ఉచితంగా అందజేసిన మొక్కలతో మహిళలు

### రైల్వే స్టేషన్‌లో తనిఖీలు


రైల్వేస్టేషన్‌లో తనిఖీలు చేస్తున్న పోలీసులు

శ్రీకాళహస్తి: పట్టణంలోని రైల్వే స్టేషన్‌లో గురువారం ఒకటో పట్టణ సీఐ గోపి ఆధ్వర్యంలో తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా రైల్వేస్టేషన్ పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ తిరుపతి ఎస్పీ ఆదేశాలతో తాము తనిఖీలు చేశామన్నారు. ఎవరైనా అనుమానిత వ్యక్తులు సంచరిస్తే తమకు సమాచారం ఇవ్వాలన్నారు. మత్తుపదార్థాలను తరలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## సమతుల ఆహారంతో సంపూర్ణ ఆరోగ్యం


రేణిగుంట: తారకరామానగర్‌లో పోషణ మాసోత్సవాలు


ఏర్పేడు: ఎండీపుత్తూరులో పౌష్టికాహార కిట్లు అందజేస్తున్న సర్పంచ్ మోహనప్రియ

రేణిగుంట: సమతుల పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హేమావతి అన్నారు. మండలంలోని తారకరామా నగర్, చైతన్యపురం ఎస్టీ కాలనీ అంగన్‌వాడీ కేంద్రాల్లో గురువారం పోషణ మాసోత్సవాలు నిర్వహించారు. బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహారం అందజేశారు. పోషక విలువలున్న ఆహార పదార్థాలను గురించి వివరించి, వాటిని తీసుకుని ఆరోగ్యంగా ఉండాలని ఆమె కోరారు.

**ఆకు కూరలు తీసుకోవాలి**

ఏర్పేడు: చక్కటి ఆరోగ్యానికి అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే పౌష్టికాహారంతోపాటు తాజా కూరగాయలు, ఆకు కూరలు తీసుకోవాలని సర్పంచ్ మోహనప్రియ అన్నారు. గురువారం మండలంలోని ఎండీపుత్తూరు అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహార మహోత్సవ వారోత్సవాలు నిర్వహించారు. గర్భిణులకు సీమంతాలు చేశారు. పౌష్టికాహార కిట్లు అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి లోకముని, అంగన్‌వాడీ కార్యకర్తలు విమల, కమలమ్మ, మల్లీశ్వరి, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

**పౌష్టికాహారంతో రక్తహీనత దూరం**

నారాయణవనం: పౌష్టికాహారంతో రక్తహీనత దూరం అవుతుందని ఎంపీడీఓ కృష్ణమూర్తి తెలిపారు. నారాయణవనంలో ఎంపీడీఓ కృష్ణమూర్తి, పీహెచ్‌సీ వైద్యాధికారి రాగసుధలు గురువారం పౌష్టికాహార మాసోత్సవాలను జ్యోతి ప్రజ్వలన చేసి, ప్రారంభించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలో ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాల్‌ను పరిశీలించారు. డాక్టర్ రాగసుధ, ఐసీడీఎస్ పీఓ శోభారాణి, ఎంపీడీఓ కార్యాలయ ఏఓ శేఖర్, సూపర్‌వైజర్ బేబీ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపీడీఓ కృష్ణమూర్తి

## తక్షణ పెట్టుబడి సాయం అందించాలి

ఏర్పేడు: ప్రభుత్వం రైతులకు తక్షణ పెట్టుబడి సాయం అందించాలని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి హేమలత అన్నారు. గురువారం మండలంలోని కందాడు సచివాలయంలో రైతు సమస్యలపై అర్జీ అందచేసే కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యవసాయానికి పెట్టుబడి కింద రైతులకు రూ.20 వేలు అందిస్తామని ప్రభుత్వం ప్రకటించిందన్నారు. వ్యవసాయ మోటార్లకు మీటర్లు తొలగించాలన్నారు. ఉచిత పంటల బీమా అందించాలన్నారు. సోమశిల–స్వర్ణముఖి కాలువ పనులను పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు రంగయ్య, శంకరరెడ్డి, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.


సమస్యలపై అర్జీ అందజేస్తున్న హేమలత

### సృజనాత్మకంగా బోధించండి

బుచ్చినాయుడుకండ్రిగ: తరగతి గదిలో విద్యార్థులకు సృజనాత్మకంగా బోధన చేస్తూ, అన్ని పాఠ్యాంశాలపై మక్కువ, అభిరుచిని కలిగించేలా బోధన చేయాలని ఎంఈఓ మునిసుబ్రమణ్యం అన్నారు. గురువారం ఆయన మండలంలోని బుచ్చినాయుడకండ్రిగ ప్రాథమిక పాఠశాల్లో విద్యార్థుల నోట్ పుస్తకాలను పరిశీలించి, ఉపాధ్యాయులకు పలు సలహాలు సూచనలు ఇచ్చారు.

## కలిక్కం సిద్ధ ఔషధం పంపిణీకి విశేష స్పందన

వరదయ్యపాళెం: లోకా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నేత్ర సమస్యల పరిష్కారానికి ఉచితంగా పంపిణీ చేస్తున్న కలిక్కం సిద్ధ ఔషధానికి విశేష స్పందన లభించింది. మండలంలోని బత్తలవల్లంలో ఉన్న ఏకం ఆలయంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో 150 మందికి ఈ ఔషధం పంపిణీ చేశారు. ఏకం వైస్ ప్రెసిడెంట్ లోకేష్ దాసాజీ మాట్లాడుతూ కలిక్కం అనేది సిద్ధ వైద్యంలో కంటి వైద్యమని సిద్ధులు సంప్రదాయబద్ధంగా ఉపయోగించే కొన్ని అరుదైన మూలికల సారాలను కళ్లలోకి పోయడంతో కంటిచూపు వృద్ధి చెందడంతోపాటు పలు చర్మ వ్యాధులు నయమవుతాయన్నారు. క్యాంప్ డైరెక్టర్ సతీష్, వైద్యులు ముత్తుకృష్ణన్ తదితరులు పాల్గొన్నారు.


ఏకంలో ఔషధం పంపిణీ చేస్తున్న లోకా ఫౌండేషన్ ప్రతినిధులు